కథ

# ఊహాతీతం

- మురళీమోహన్ క్రోవి

ఎన్నాళ్ళయింది కాలేజి చూసి, ఎప్పుడూ జీవితంలో బిజీ బిజీగా వుండాల్సిన పరిస్థితి! బస్సులో నుంచి చూస్తుంటే పంటపొలాలు, మధ్యమధ్యలో చిన్న చిన్న వూళ్ళు వేగంగా కదిలివెళ్తుంటే, తన కాలేజీ రోజులు ఎంత త్వరగా గడచిపోయాయో తలచుకుంటూ, హాయిగా, తల వెనక్కి వాల్చి కూర్చున్నాడు వినీత్. వినీత్ కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీని వదలి పది సంవత్సరాలు నిండాయి. ఆ సందర్భముగా పాత స్నేహితులందరూ కలుసుకోవాలని, రెండు రోజులు ఆనందంగా కాలేజీ క్యాంపస్‌లో గడపాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం ఫ్యామిలీస్‌తో పాటు రమ్మని ఇన్విటేషన్స్ పంపించారు. ప్రిన్సిపాల్ అనుమతితో హాస్టల్‌లో గదులు కూడా తీసుకున్నారు.

విజయవాడ నుండి బయలుదేరింది బస్సు. పగటిపూట ప్రయాణం వల్లనేమో, ప్రయాణీకులు సగం మంది కూడా లేరు. ఎండగా వుండటం వల్లనేమో కండక్టర్‌తో సహా అందరూ కునికిపాట్లు పడుతున్నారు.

మూడు గంటల ప్రయాణం తరువాత ఏలూరు చేరుకుంది బస్సు. కండక్టర్ బస్సు 15 నిమిషాలు ఆగుతుందని చెప్పాడు. అందరూ బస్సు దిగి క్యాంటీన్ వైపు నడిచారు. కొంతమంది కాఫీ, టీల కోసం మరికొందరు టిఫిన్స్‌కోసం కౌంటర్ వైపు నడిచారు. వినీత్ ఒక మూల టేబుల్ దగ్గర కూర్చుని అందరినీ పరిశీలనగా చూస్తున్నాడు. ఇంతలో వేరొక వైపు టేబుల్ దగ్గర కూర్చున్న ఒక అమ్మాయి కనిపించింది. ఒక్కతే కూచుని వుంది, ప్రక్కన చిన్న ఎయిర్‌బ్యాగ్‌తో. ప్రక్కనుంచి చూస్తే ఎవరో తెలిసిన మొహంలా అనిపించి అటువైపు వెళ్ళాడు వినీత్. ఎదుటి నుంచి, పరిచయం వున్న మనిషిలా అనిపించింది. "మీరు సుధామయి కదూ! " అన్నాడు. కొత్త ప్రదేశంలో నన్నెవరు పలకరించారా అన్నట్లు, ఆ అమ్మాయి కొంచెం ఆశ్చర్యంతో "మీరు!" అనేంతలో "నేను వినీత్‌ని, కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో, పదేళ్ళ క్రితం మెకానికల్ బ్రాంచ్‌లో కలిసి చదువుకున్నాము".

సుధామయి గుర్తుపట్టినట్లుగా, చిరునవ్వుతో. "మీరు చాలా మారిపోయారే, అస్సలు గుర్తుపట్టలేనట్లు". 'కాల ప్రభావంలెండి. మీలో మటుకు మార్పు రాలేదు కొంచెం లావయ్యారు" అన్నట్లు చేతులు వెడల్పు చేసి చూపించాడు.

''మీరు ఇప్పుడు ఎక్కడ వుంటున్నారు? కాకినాడకేనా ప్రయాణం! మీ బస్సు ఎక్కడ?" అడిగాడు వినీత్.

"వుండటం విజయవాడలో, అడ్రస్ మారటం వల్ల ఇన్విటేషన్, నిన్ననే అందింది. హడావిడిగా ఈరోజు ఉదయమే బస్సు ఎక్కాను. అది కాస్తా ఫెయిల య్యిందని చెప్పగానే, వేరొక దాని కోసం ఎదురు చూస్తున్నాను."

''నేను కూడా మన వాళ్ళ ప్రోగ్రాంకే బయలుదేరాను. అందర్నీ చూసినట్లుంటుందని,యిదో సరదా ప్రయాణం చాలా రోజుల తరువాత, మా బస్సులో చాలా వరకు ఖాళీలు వున్నాయి. కండక్టర్‌తో మాట్లాడతాను రండి. తెలిసిన వాళ్ళుంటే ప్రయాణం బోర్ కొట్టకుండా వుంటుంది" చెప్పాడు వినీత్. దూరంగా నిలబడి వున్న కండక్టర్‌తో మాట్లాడి, సుధామయికి బస్సులో సీటు సంపాదించాడు. కిటికీ వైపు సుధామయి. ప్రక్కన తను కూర్చున్నాడు.

బస్సు తిరిగి కాకినాడ వైపు ప్రయాణం మొదలు పెట్టింది. 'మీరు యిప్పుడు ఎక్కడ వుంటున్నారు? ఏంచేస్తున్నారు? ' అడిగింది సుధామయి. "నాకు యిక్కడ అని కాకుండా, తిరిగే వుద్యోగం దొరికింది."

''మీకు కలుపుగోరుగా మాట్లాడడం పోలేదన్నమాట. కాలేజీలో ఎంత కలివిడిగా తిరిగేవారు.

మన మొత్తం బ్యాచ్‌లో. అందుకే ప్రవృత్తికి తగ్గట్టుగా వృత్తి అంటారు పెద్దవాళ్ళు."

"అప్పట్లో మంచి, మంచి కవితలు రాసేవారు. అప్పుడప్పుడు కొంటె కవితలు కూడా ! యింకా రాస్తున్నారా!" పాతరోజులు గుర్తుచేసుకుంటూ అడిగింది సుధామయి.

"లేదండీ ! ఊహలు వయసుకి తగ్గట్టుగా వస్తాయి. కొంటెవి కాకపోయినా, మంచి వాటి కోసం ప్రయత్నిస్తున్నాను. అప్పుడెప్పుడో ప్రేమలేఖ రాసాను. దానికి ప్రతిఫలం దక్కలేదు." తను కాలేజీలో వున్నప్పుడు సుధామయికి రాసిన లవ్‌లెటర్‌ని తలుచుకుంటూ - వినీత్ అన్నమాటలు విననట్టుగా, సుధామయి కిటికీలోంచి బయటకు చూస్తోంది. గాలికి ఎగురుతున్న ఆమె వెంట్రుకలను చూసి,

"గాలికెగురుతున్న నీ ముంగురులు, అది చూసి
ఊయలవలె వూగెలే నీ రింగులు"

సన్నగా పాటలాగా పాడాడు వినీత్.

సుధామయి తల త్రిప్పి, "కొంటె కవితలు మానలేదన్నమాట. కొంపదీసి మళ్ళీ కాలేజీ రోజులలోకి వెళతారా ఏమిటి?"

"ఇప్పుడు వెళ్ళేది అక్కడికే కదా! ఆశువుగా ఏదన్నా చెప్పాలనిపిస్తే, ఆపుకోలేను" చెప్పాడు వినీత్.

"అలాగయితే మంచి కథ ఏదన్నా చెప్పకూడదూ! మీరు కాలేజీలో లంచ్ టైమ్‌లో, ఫ్రెండ్స్‌కి చెప్పేవారని వినికిడి. అందులోనూ ప్రేమకథలు ఎక్కువగా. ప్రయాణం బోర్‌గా వుండకుండా వుంటుంది."

"యిప్పుడా! అలా సడన్‌గా అడిగితే ఎలా చెప్పండి. అందులోనూ ప్రేమకథ, ఒకప్పుడు ప్రేమించిన మనిషితో" చిరునవ్వుతో అన్నాడు వినీత్. "మీరు ట్రై చేస్తే అప్పటికప్పుడు అల్లగరు. చెప్పగలరు. నాకా నమ్మకం వుంది. యిప్పుడే గా కవితలాంటిది వినిపించారు."

వినీత్ కొంచెం సేపు ఆలోచించి, "ఓకే! అలాగయితే నేను చెప్పిన కథ విన్న తరువాత, మీరు ఏ విధమయిన కామెంట్స్ చేయకూడదు. సంతోషం కలిగినా, బాధకలిగినా విని మరిచిపోవాలి. ఎవ్వరికి చెప్పవద్దు" అని కళ్ళు మూసుకుని, ఏదో గుర్తుకు తెచ్చుకున్నట్లు ప్రయత్నించాడు. సుధామయి తదేకంగా వినీత్ వంకే చూస్తోంది. రెండు నిమిషాల తరువాత కళ్ళు తెరచి, కథ చెప్పటం మొదలు పెట్టాడు.

**సుధామయి గుర్తుపట్టినట్లుగా, చిరునవ్వుతో, "మీరు చాలా మారిపోయారే, అస్సలు గుర్తుపట్టలేనట్లు". 'కాల ప్రభావంలెండి. మీలో మటుకు మార్పు రాలేదు కొంచెం లావయ్యారు" అన్నట్లు చేతులు వెడల్పు చేసి చూపించాడు.**

☆ ☆ ☆

శేఖర్ ఎం.సి.ఏ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఒక కంపెనీలో ఐదేళ్ళ నుంచి ప్రోగ్రామర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు గుడివాడ దగ్గర వూళ్ళో వుంటారు. వాళ్ళ కుటుంబంలో కాస్తా చదువుకొని, మంచి ఉద్యోగంలో చేరింది శేఖరే. తన స్వశక్తితో తన కాళ్ళమీద తను నిలబడాలన్నది చిన్నప్పటినుంచి వున్న కోరిక. అలాగే మొదటి నుంచి చదువులో బాగా రాణించాడు. విదేశాలలో అవకాశాలు వచ్చినా, తల్లిదండ్రులకి దూరమెందుకని, వదులుకున్న సందర్భాలు కూడా వున్నాయి. అత్యాశకి పోకుండా వున్నదాంట్లో సంతృప్తిగా వుండాలనుకోవటం అతని తత్వం.

అమ్మా నాన్నలు పెళ్ళి గురించి ప్రస్తావించినప్పుడల్లా, ఏదో ఒక సాకుతో వద్దంటూ వచ్చాడు. పెళ్ళి మీద ఒక నిర్దిష్ట అభిప్రాయం కలిగి వుండాలంటాడు. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని కాబోలు అతని వుద్దేశ్యం అనుకునేవాళ్ళు బంధువర్గంలో చాలా మంది వున్నారు. హైదరాబాద్ సిటీలో ఒక్కడేవుంటే, ఏదో యిలాంటి విషయం వుండకబోదు అనుకునే మనస్తత్వం చాలా మందిది. తనకంటూ దగ్గరి స్నేహితులు సిటీలో ఎవరూ లేకపోవడంతో, ఆలోచనలు పంచుకోవడానికి కొంత యిబ్బంది పడేవాడు. ఆఫీసులో చాలామంది 'హాయ్' అంటే 'హాయ్' అనేవాళ్ళు ఎక్కువ.

ఏడాది క్రితమే బైక్ కొనుకున్నాడు. వారం కొకసారి తప్పకుండా గుడికి వెళ్ళటం అతనికి ఆనవాయితీగా మారింది. ఎన్ని ఫోన్స్ చేసుకున్నా, అమ్మానాన్నలకి

**రాత్రి పన్నెండు గంటల వేళ, ఎవరో నెమ్మదిగా తలుపు కొడుతున్నారు. మొదట నిద్రలో అర్థం కాలేదు. మళ్ళీ మళ్ళీ కొడుతున్న చప్పుడు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని, 'వచ్చినవాళ్ళు బెల్ కొట్టొచ్చు కదా' అనుకుంటూ లైటు వేసి తలుపుతీసాడు.**

వుత్తరాలు రాయటం శేఖర్‌కున్న ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. కాని తన అభిప్రాయాలని, ఆలోచనలని వుత్తరాలలో ఎప్పుడూ వుంచడు. ఎక్కువగా కుశలోపరిగా వుంటాయి.

ఒకరోజు బైక్ సర్వీసింగ్‌కి యిచ్చి, ఆటో కోసం రోడ్డు మీదకి వచ్చాడు. సర్వీసింగ్ సెంటర్ తన ఆఫీస్‌కి వెళ్ళే దోవలోనే వుంది. పది నిమిషాలు నిలుచున్నా ఒక్క ఆటో కూడా కనిపించలేదు. వుదయమే కావటంతో, బస్‌స్టాప్‌లో జనం పల్చగా వున్నారు. ప్రక్కనే వున్న పాన్ డబ్బావాడిని అడిగితే, ఆటోలు రాత్రి నుంచి బంద్ అని చెప్పాడు. వెహికల్ సర్వీసింగ్‌కి యిచ్చే హడావుడిలో న్యూస్ పేపర్ చూడకుండా బయలుదేరినందుకు, తనని తనే తిట్టుకుంటూ, బస్టాప్‌లో సిటీబస్సుకోసం ఎదురు చూడక తప్పలేదు. ఆఫీసుకి లేటు అవుతుందేమోనని వాచ్‌వంక, రోడ్ వైపు పదేపదే చూసుకుంటున్నాడు.

అదే సమయంలో తనని ఎవరో పిలుస్తున్నట్లు అనిపించి ఎడం వైపు తలతిప్పాడు. అక్కడ ఎవరూ తెలిసిన వారు కనబడలేదు. అప్పుడు పడింది శేఖర్ చూపు ఒక అమ్మాయి మీద. ఎంత చక్కగా వుంది. మంచి చూపు, చక్కటి చీరకట్టు, నిండుగా హుందాగా వుంది. ఏదో పరిచయం వున్న మనిషిలా అనిపించింది. కొంచెం సేపు రెప్పవేయకుండా చూస్తు వుండిపోయాడు. ఎంత కాలంగానో ఎదురుచూస్తున్న వ్యక్తి ఎదురుపడినంతగా, చూపు మరల్చుకోలేకపోయాడు.

ఇన్నాళ్ళ నుంచి సిటిలో వుంటున్నా, ఏ అమ్మాయి శేఖర్‌ని యింతగా ఆకట్టుకోలేదు. శేఖర్ కూడా యింత త్వరగా ఏ అమ్మాయి మీద ఒక అభిప్రాయానికి రాలేక పోయాడు. యింతలో ఏదో బస్సు వచ్చి ఆగడంతో, శేఖర్ వులికిపాటుతో, నంబర్‌కోసం ఆ అమ్మాయి ముందు నుంచి పరుగెత్తాడు. తనక్కావలసిన బస్సు కావటంతో, ఎక్కి లిప్తకాలం పాటు ఆ అమ్మాయి కూడా ఎక్కుతుందేమోనని కిటికీలోంచి చూసాడు. ఎక్కలేదు. బస్సు రోడ్డు మీద పరుగెట్టింది. 'బస్సు యింత త్వరగా రాకపోతే ఏమయింది' అనుకున్నాడు శేఖర్. ఆ సమయంలో ఆఫీస్‌కి వెళ్ళాలి, ఆలస్యం అవుతుందన్న ధ్యాసే లేదు శేఖర్‌కి. అంతలా శేఖర్ మనసులో చోటు సంపాదించింది ఆ అమ్మాయి.

☆ ☆ ☆

ఒక మనిషి యింకొక మనిషిని ప్రేమించటానికి పరిచయం ముఖ్యమైనది కాదు. కాని, చాలా సంఘటనలలో, పరిచయంతోటే ప్రేమ పుట్టుకొస్తుంది. ఆ రోజు రాత్రి శేఖర్‌కి నిద్రపట్టక, మేడపైన పచార్లు చేస్తున్నాడు. ముఖపరిచయం కూడా లేకుండా ఆ అమ్మాయి మీద తనకి అంతలాగా అభిప్రాయం ఎలా కలిగింది. ఎంతో పరిచయం వున్నవాళ్ళు, ఎన్నో ఏళ్ళ తరువాత ఎదురుపడిన భావన. తనమీద ఆ అమ్మాయికి ఎలాంటి అభిప్రాయం వుందో తెలీదు. తనుమటుకు చాలా వూహించుకున్నాడు. అసలు ఆ అమ్మాయి తనను చూసిందో లేదో కూడా తెలియదు. తనతోటి పరిచయం ఎలా చేసుకోవాలో అర్థం కావడం లేదు. రకరకాల ఆలోచనలు, ఆశలు. యిలాంటి అనుభవం జీవితంలో ఎదురవుతుందని శేఖర్ ఎప్పుడూ అనుకో లేదు. యీ స్థితిలో నిద్ర ఎలా పడుతుంది.

ఉదయం ఎప్పుడు అవుతుందా! అన్న ఆలోచనతో శేఖర్ నిద్రలోకి జారిపోయాడు. ఉదయాన్నే పక్కింట్లో కుక్కర్ చప్పుడుతో మెలకువ వచ్చింది. టైము చూస్తే ఏడు గంటలయింది. నిద్ర తక్కువవడంతో కళ్ళు ఎర్రబడి, మొహం వుబ్బరించింది. ఆఫీసు కెళ్ళాలనే హడావుడిలో తొందరగా తయారయ్యి, బైక్ స్టార్ట్ చేసి, యింటి నుంచి బయలుదేరాడు. యథాలాపంగా బస్టాప్ రాగానే, తలత్రిప్పి చూసాడు. ముందు రోజు సంఘటన గుర్తుకొచ్చి సమయమదే కాని ఆ అమ్మాయి కనబడలేదు. ఆశ్చర్యపోవలసిన సంఘటన కాదని తెలుసు శేఖర్‌కి . బహుశ తనకు కావలసిన బస్సు దొరికిందేమో అనుకున్నాడు.

☆ ☆ ☆

ఏదో వూరు రావడంతో, డ్రైవర్ బస్సుని రోడ్డు ప్రక్కన ఆపి, టీ తాగడానికి క్రిందికి దిగాడు. ఎండగా వుండడం వల్ల, సుధామయి మంచినీళ్ళు బాటిల్ తీసుకుని, కొన్ని నీళ్ళు తాగి, "వినీత్ నీ కథలో అమ్మాయికి మంచి పేరు పెట్టకూడదూ! ప్రతిసారి 'అమ్మాయి, అమ్మాయి' అని పిలుస్తుంటే బాలేదు." అని నీళ్ళు కావాలేమోనని అడిగింది.

"పేరు లేకపోతే కథ బోర్ కొడుతోందా!" అన్నాడు వినీత్. కొంచెం సేపు ఆలోచించి, "నందిని పేరు ఎలా వుంది?" అడిగాడు వినీత్. "కాని కథలో నందిని పేరు శేఖర్‌కి తెలియదు మనకు మాత్రమే తను నందిని. అలాగే చెప్పటానికి ప్రయత్నిస్తాను."

బస్సు బయలుదేరబోతుంటే వినీత్ రెండు మొక్క జొన్న పొత్తులు కొన్నాడు, ఒకటి సుధామయికి యిస్తూ... మళ్ళీ ప్రయాణం మొదలు. బస్సు స్పీడందుకోగానే సుధామయి వినీత్ వంక చూసింది మిగిలిన కథకోసం.

☆ ☆ ☆

ఆఫీసులో పని హడావిడిలో పడి, నందిని సంగతి గుర్తు తెచ్చుకొనే తీరిక దొరకలేదు శేఖర్‌కి. కాని సాయంత్రం చీకటి పడే వేళలో యింటికి చేరుకోగానే, మళ్ళీ ఆలోచనలు మొదలు. కొంచెం అసహనంగా, చిరాకుతో వున్నాడు. అవే ఆలోచనలు. అసలు తనది ప్రేమా లేక ఆకర్షణో తేల్చుకోలేని క్షణాలు వచ్చి పడినప్పుడు తనలో తను మధనపడ్డాడు. తనకు మాత్రం గట్టి నమ్మకం,అది ఆకర్షణ కాదు, ప్రేమేనని. ప్రేమని అనుభవించగలమేమోగాని, నిర్వచించటం ఎంత కష్టమో శేఖర్‌కి తెలిసే సమయానికి కళ్ళు మూతలు పడి నిద్రలో కెళ్ళిపోవటం జరిగింది.

ఉదయాన్నే వులికిపాటుతో లేవటం, హడావుడిగా తయారవటం, నందినికోసం చూడటం, ఆఫీసులో పని ఒత్తిడితో మరురోజు గడిచిపోయింది. అలా నాలుగు రోజులు గడిచిపోయాయి. అన్ని రోజులు నందిని కనిపించక పోగా, ఆలోచనలు ఆత్రుత ఎక్కువయ్యాయి. నందిని గురించి వివరాలన్నీ తెలుసుకోవాలి. పరిచయం పెంచుకోవాలి. తనది ఆకర్షణకాదు, నిజమైన ప్రేమ

> "అప్పట్లో మంచి, మంచి కవితలు రాసేవారు. అప్పుడప్పుడు కొంటె కవితలు కూడా ! యింకా రాస్తున్నారా!" పాతరోజులు గుర్తుచేసుకుంటూ అడిగింది సుధామయి.

అని వ్యక్తపరచాలనే ఆకాంక్ష ఎక్కువయింది. తల్లిదండ్రులకి ఫోన్ చేయటం కాని, వుత్తరాలు రాయటానికి గాని సమయాన్ని కేటాయించలేక పోయాడు.

అటువంటి సమయంలో శేఖర్‌ని ఆశ్చర్యంలో ముంచెత్తుతూ బోయిగూడ కాథోలిక్ సిమెటరీ లోపలికి వెళుతూ నందిని కనిపించింది. శేఖర్ బైక్‌మీద వేగంగా వెళుతున్నాడు. అంతా లిప్తపాటు కాలంలో జరిగిపోయింది. వెంటనే కొంత దూరంలో టర్న్ తీసుకొని సిమెటరీ దగ్గర ఆగి, లోపలికి వెళ్ళబోయాడు. గేటు వాచ్‌మాన్ "ఏంకావాలి సార్!" అడిగాడు. శేఖర్‌కి ఏం చెప్పాలో పాలుపోలేదు. కనీసం నందిని పేరుగాని, లోపలకి ఎందుకెళ్ళిందో కూడా తెలియదు.

"ఇంతకు ముందే లోపలికి, రెడ్ కలర్ శారీతో ఒకమ్మాయి వెళ్ళింది. నీవు గాని చూసావా! " నీళ్ళు నములుతూ అడిగాడు శేఖర్. వాచ్‌మేన్ శేఖర్ వంక ఎగాదిగా చూస్తూ, రెండు గంటల నుంచే యిక్కడే డ్యూటీ చేస్తున్నా! ఎవరన్నా లోపలికి వెళితే నాదగ్గర రిజిష్టర్‌లో పేరు రాసి వెళతారు. వుదయం నుంచి ఒక్క పేరు కూడా రాసిలేదు." రిజిష్టర్ చూపించాడు వాచ్‌మేన్. ఆరోజు ఎలాగైనా నందినిని కలవాలని, అక్కడే పేవ్‌మెంటు మీద గంటన్నర సేపు ఎదురుచూసాడు వినీత్. అప్పటికీ వాచ్‌మెన్ రెండు మూడు సార్లు చెప్పాడు, శేఖర్ నిలబడి ఎదురుచూడటం యిష్టం లేక. శేఖర్ మనసు ఒప్పుకొనే స్థితిలో లేడు. అన్యమనస్కంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

☆ ☆ ☆

మరునాడు ఆదివారం కావడంతో, ఆలస్యంగా నిద్రలేచినా తొందరగా తయారయ్యి, వున్న అలవాటు ప్రకారం కాచిగూడలోని కృష్ణమందిరానికి బయలుదేరాడు.

ఎప్పుడూ రైల్వేస్టేషన్‌కి ఆ మందిరం నుంచి వెళ్ళటమే గాని, ఆగి దర్శనం చేసుకోవటం కుదరలేదు. ఎందుకనో ఆరోజు మనసులో అదే గుడికి వెళ్ళాలని చాలా ఆత్రుతగా అనిపించటంతో బయలుదేరాడు శేఖర్.

చిన్న గుట్టమీద వుంది గుడి. పైకెక్కడానికి, దిగడానికి వేరుగా మెట్లు ఉన్నాయి. ఎంత చక్కగా అలంకరించారు కృష్ణభగవానుడిని. ప్రేమతత్వం పుట్టిపడేటట్లు వుంది. దర్శనం చేసుకుని దిగి వస్తుంటే, మూడు రోడ్ల కూడలిలో ఆటో ఎక్కుతూ కనిపించింది నందిని. గబగబా దిగి వచ్చే లోపల ఆటో ఎటు వైపు వెళ్ళిందో తెలియని స్థితిలో, ఆదుర్దాగా అటూ యిటూ చూస్తూ నిలబడిపోయాడు శేఖర్. ఏంచేయాలో పాలుబోని స్థితి. మెదడులో ఎన్నో ఆలోచనలు. ఆదివారం కావడంతో అవే ఆలోచనలతో, ఒంటరిగా గడిపేసాడు. పగలంతా దుఃఖమయం. సాయంత్రానికి ముఖం ఎర్రబడి, ఏడవలేని పరిస్థితిలో కాలం వెళ్ళబుచ్చాడు.

రాత్రి పన్నెండు గంటల వేళ, ఎవరో నెమ్మదిగా తలుపు కొడుతున్నారు. మొదట నిద్రలో అర్థం కాలేదు. మళ్ళీ మళ్ళీ కొడుతున్న చప్పుడు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని, 'వచ్చినవాళ్ళు బెల్ కొట్టొచ్చు కదా' అనుకుంటూ లైటు వేసి తలుపుతీసాడు. ఆశ్చర్యంతో నోరుతెరచి అలాగే కాసేపు మాటల్లేకుండా నిలుచుండి పోయాడు. ఎదురుగుండా నందిని, అందులోనూ యింత రాత్రివేళ. లోపలికి రమ్మన్నాడు గాని, ఏవేవో మాట్లాడాలనుకున్నా, నోరు మెదపలేక పోతున్న శేఖర్.

మనసులో భావాలు ఎన్నున్నా ; కావాలనుకున్న, కావలసిన మనిషితో మాటలు రాని మూగవాని భావాలకు మల్లే ఎగసెగసి పడుతున్న ఆలోచనలు. ఇతని మాట కోసం ఎదురుచూస్తోంది నందిని మౌనంగా. అలా ఎంత సేపు ఒకరికెదురుగా ఒకరు కూర్చున్నారో తెలుసుకొనేంతలో అలారం మోగటంతో వులికిపాటుతో మెలుకువ వచ్చింది శేఖర్‌కి.

'మాటలు కాదుకదా! కనీసం పేరు కూడ అడగలేదు' అనుకొని, తన నుంచి దూరంగా వెళ్లిపోయిన నందిని కోసం మళ్లీ ఎదురు చూపులు ఎన్నాళ్లో. ఈ భావోద్వేగాలని అధిగమించాలంటే, ఒకటే పద్ధతి. వాటికి అక్షర రూపం కల్పించి, ఈసారి తను కనబడినప్పుడు ఇవ్వటమే లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు శేఖర్.

☆ ☆ ☆

ప్రక్కనే వున్న పొలాల నుంచి వేడిగాలి వేస్తున్నా అందులోనే హాయిని వెతుక్కుంటూ, సుధామయి నిద్రలోకి జారిపోవటం గమనించాడు వినీత్. మిగిలిన కథ చెప్పినా వినలేదని తెలుసుకుని, ఊరు చేరుకొనే లోపలే 'కథని కంచికి పంపించాలన్నట్లు' పేపర్ పెన్ను తీసుకుని రాయటం మొదలు పెట్టాడు. ఎందుకనో కాకినాడ చేరే వరకు సుధామయితో కలిసి ప్రయాణం చేయలేనని వినీత్‌కి తెలుసు. యిష్టం లేదు కూడా.

"నువ్వు నిద్రలోకి పోవటం గమనించి, యిలా రాయవలసి వస్తుందని నేనూహించలేదు. కథని ఎలా ముగించాలా, ముగింపు నా ద్వారా నీకెలా తెలియజేయాలా అనుకునేంతలో, ఈ అవకాశం రావటం వూహకందలేదు. నీ భావాలు నేను చూడదలుచుకోలేదు. నీకు చాలా అనుమానాలు, ప్రశ్నలు వుదయించవచ్చు. వాటిని ఎదుర్కొనే స్థితిలో నేను లేకుండా, మధ్యలో దిగిపోతున్నందుకు బాధగా వుంది.

యిక కథలో కొస్తే, శేఖర్ మనసులో అంతలా ముద్రవేసుకున్న నందిని ఎప్పుడు ఎక్కడ, ఎలా ఎదురు పడుతుందా! అన్న ఆశతో రోజులు గడుపుతున్నాడు. నందిని గురించి తన భావాలన్నిటిని పేపర్ మీద మాత్రం కష్టం మీద రాయగలిగాడు. తను ఎప్పుడు కనిపించినా అందజేయాలని. పనిమీద ఏకాగ్రత తగ్గిపోవటం కొలీగ్స్ గమనించినా, తనకు మాత్రం పట్టనట్లుంటున్నాడు.

ఒకరోజు మేనేజర్ శేఖర్‌ని రూమ్‌లోకి పిలిపించాడు. ఆయన కొన్నాళ్ళుగా జరుగుతున్న సంగతులన్నీ తెలుసుకోవాలని ప్రయత్నించాడు. శేఖర్ వాళ్ళ అమ్మ, నాన్నలకి ఫోన్ చేయటంలేదని, సంగతి ఏమిటో తెలుసుకోమని ఆఫీసుకి కంగారుగా ఫోన్ చేసిన సంగతి చెప్పేటప్పటికి, శేఖర్ ఒక్కసారిగా వులికి పాటుతో ఈలోకంలోకి రాగలిగాడు. ఏడుపు కట్టలు తెంచుకొచ్చింది. కొంత సముదాయించాక, సంఘటనలన్నీ మేనేజర్‌కి వివరించాడు.

మేనేజర్ వెంటనే ఫోన్ తీసుకుని తనకు తెలిసిన డాక్టర్ వినయ్‌కుమార్‌తో సాయంత్రానికి అపాయింట్ మెంట్ తీసుకున్నాడు. శేఖర్‌ని ఆరోజు సాయంత్రం తనే వెంటబెట్టుకొని, డా. వినయ్ దగ్గరికి తీసుకెళ్ళాడు. నేమ్ బోర్డు చూడగానే ఖంగుతిన్నాడు. "ఏమిటిసార్ మనకి సైక్రియాటిస్టుతో ఏంపని" అడిగాడు శేఖర్. "నీ గురించే మాట్లాడుదామని" నచ్చజెప్పి లోపలికి తీసుకెళ్ళాడు. పరిచయాలు అయిన తరువాత, డాక్టర్ మేనేజర్‌ని బయట కూర్చోమని చెప్పి, శేఖర్‌ని తన పద్ధతిలో కబుర్లలోకి దింపాడు. పేపర్ మీద శేఖర్ ఫ్యామిలీ హిస్టరీ గురించి మిగిలిన వివరాలు ప్రశ్నమీద ప్రశ్నలు అడుగుతూ, తన భాషలో ఏవో రాసుకుంటూ పోయాడు. అలా అరగంట గడిచింది.

వివరాలన్నీ తెలుసుకున్నాక, మేనేజర్‌ని లోపలికి పిలిచి, "నాకు తెలిసినంత వరకు శేఖర్ 'హాలోజినేన్' అనే ప్రాబ్లమ్‌ని ఫేస్ చేస్తున్నాడు. ఒంటరిగా చిన్నతనం నుండి హాస్టల్‌లో వుండి, చదువుకొనటం వల్ల తనకంటూ కొన్ని భావాలు, అభిప్రాయాలు మస్తిష్కంలో నిక్షిప్తం చేసుకున్నాడు. వాటి ప్రభావం వల్లే ఇతనిలో కొద్ది కాలంగా జరుగుతున్న మార్పులు యిలా అందరిలో జరగాలని లేదు. వెరీరేర్ కేసేస్‌లో బయటకు వ్యక్తపరుస్తారు. నాకు తెలిసినంత వరకు శేఖర్‌లో నిగూఢంగా వున్న భావాలకు ప్రతిరూపమే ఈ 'నందిని' అనబడే అమ్మాయి. శేఖర్ జాగ్రత్తగా నేను యిచ్చిన మందులు వేసుకుని, రెస్ట్ తీసుకొని, త్వరలో ఒక యింటివాడైతే, ఈ ప్రాబ్లెమ్ తగ్గుతుందని నాగట్టి నమ్మకం. అతని అమ్మా, నాన్నలతో వివరంగా మాట్లాడండి" చెప్పాడు.

మేనేజర్ కారులో శేఖర్‌ని ఆఫీసు దాకా తీసుకెళ్లి జాగ్రత్తలు తీసుకోమని, ఊరికి ఫోన్ మరువకని మరీ మరీ చెప్పాడు. శేఖర్ అలాగేనని బైక్ స్టార్ట్ చేసి, యింటికి బయలుదేరాడు. ట్యాంక్ బండ్ మీద వాహనాలు పరుగులు తీస్తున్నాయి. క్షణకాలం కుడివైపుకి తలత్రిప్పి చూసాడు. నీ రెండలో గడ్డిలో కూర్చుని తనవంకే, తనకోసమేనా అన్నట్లు ఎదురుచూస్తూ కనిపించింది నందిని. ఈసారి అవకాశం వదలకూడదు తనను తీసుకెళ్ళి డాక్టర్‌కి, కాదు కాదు అందరికీ చూపించాలి అనుకొని బైక్ కుడివైపుకి త్రిప్పాడు. ఎదురుగా వస్తున్న మెట్రోబస్ ఆగలేని పరిస్థితిలో బైక్‌ని గుద్దుకోవటం, శేఖర్ ఎగిరి తల పేవ్‌మెంట్‌కి తగలటం, నందినిని తలుచుకుంటూ ఈలోకం విడిచి వెళ్ళటం ఊహించని పరిణామాలు. ఇంతటితో కథ ముగిస్తాను. నేను దిగివెళ్ళవలసిన సమయం దగ్గరకొచ్చింది.

చివరిగా చిన్నమాట, యిప్పుడు చెప్పిన కథలో శేఖర్ ఎవరో కాదు. ఆశేఖరే, ఇప్పుడు నీతో పయనించిన వినీత్. ఆశ్చర్యపోకు అని నేను చెప్పను. కాని నిజాన్ని అబద్ధం చేయలేకపోవటం వల్ల, నిన్ను వదలి వెళ్తున్నందుకు, క్షమిస్తావని ఊహిస్తూ...."ఇక శలవు".

నీ వినీత్.

ఒక్క క్షణం బస్సుని ప్రక్కకి ఆపించి, లెటర్ మడతపెట్టి, కండక్టర్‌కి సుధామయి లేచాక యివ్వమని చెప్పి, దిగిపోయాడు వినీత్. బస్సు దుమ్ము లేపుకుంటూ దూరంగా వెళ్ళాక, పచ్చటి పొలాల మీద నుంచి స్వేచ్ఛా విహంగంగా గాలిలో ఎగురుతూ మిగతా ప్రయాణం సాగించాడు వినీత్.

☆ ☆ ☆

కాకినాడ బస్టాండ్‌లో వినీత్ ఎటు వెళ్ళాడా అని అటూ ఇటూ చూస్తూ, బ్యాగ్ తీసుకుని,బస్సు దిగుతున్న సుధామయి చేతికి, లెటర్ అందించాడు కండక్టర్. చదివిన తరువాత నమ్మశక్యంగాని, నమ్మకంలేని నిజాన్ని జీర్ణించుకోలేక ఖంగుతింది సుధామయి. స్తబ్ధుగా కాసేపు అలాగే నిలువలేక కూచుండిపోయింది.

రివ్వున వీచిన గాలికి చేతిలోని కాగితం ఒక్కసారి ఎగిరి ప్రక్కనే వున్న ప్రయాణీకుల గుంపు మధ్యలో పడింది. దానిని అందుకోవాలని వెళ్ళిన సుధామయికి, అందులో ఒకాయన "తెల్లకాగితం కోసం అంత వరుగెందుకమ్మా! పెన్ను ఏమన్నా కావాలా రాసుకోవడానికి" అన్నమాటలు చెవులలో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. అప్పుడు సుధామయి పాత స్నేహితులతో జరిగిన సంఘటనలను, సంగతులను పంచుకోలేని స్థితిలో విజయవాడకి తిరుగుప్రయాణంలో వుంది.

☆ ☆ ☆